

పశ్చిమం వృద్ధి పథం

పశ్చిమ ప్రకాశంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు ఇతర భవనాల నిర్మించారు. - 8లో..



సత్తా చూపిన సిక్కోలు చీతాస్

పర్చూరులో సౌత్ ఇండియా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు తలపడుతున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
30.8/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

50 ఎయిడెడ్ పాఠశాలలపై చర్యలు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో పట్టుమని పదిమంది విద్యార్థులు కూడా లేని పాఠశాలలు 50 ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 142 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 85 ప్రాథమిక, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 42 ఉన్నత పాఠశాలలు ఉండగా వాటిలో 50 పాఠశాలల్లో 10 మంది కంటే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. అయితే 142 పాఠశాలల్లో 654 మంది పనిచేస్తుంటే ఈ 50 పాఠశాలల్లో మాత్రం 180 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మండలాల వారీగా పరిశీలిస్తే కొమరోలు మండలం 5, గిద్దలూరు మండలం 6, మార్కాపురం మండలం 3, వై.పాలెం 1, పుల్లలచెరువు 1, అర్థవీడు 1, కంభం 2, దొనకొండ 1, కనిగిరి 2, నాగులుప్పలపాడు 4, మార్టూరు 1, ఇంకొల్లు 1, పర్చూరు 1, చీరాల 3, కొరిశపాడు 1, కారంచేడు 1 ఉన్నాయి. వీటిలో 42 ప్రాథమిక పాఠశాలలు కాగా మరో 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కోఆర్డినేషన్ పయ్యావుల పార్వతి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత పాఠశాలలపై ఈనెల 22వ తేదీలోగా తక్షణ చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను వెంటనే విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఆమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భీమనాథం హనుమారెడ్డికి ఘన నివాళి



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

ఒంగోలు మెట్రో: తెలుగు సాహిత్య చరిత్రలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం ఖ్యాతిని ఇనుమడింపజేసిన సంఘం పూర్వ అధ్యక్షుడు భీమనాథం హనుమారెడ్డి నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని వీఐపీ రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. హనుమారెడ్డి అనేక కావ్యాలను రచించి కీర్తిని పొందారని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. వృద్ధాప్యం మీద ఆయన రాసిన కావ్యం ఆంగ్లంలోకి అనువదింపబడి అనేకమంది ప్రముఖుల ప్రశంసలు అందుకుందని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ ఆయన రచనలపై పలువురు పీహెచ్‌డీ చేసి డాక్టరేట్లు పొందారన్నారు. కార్యక్రమంలో సాహితీసుధ కనిగిరి అధ్యక్షుడు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అమృతవర్షిణి ఉప్పుగుండూరు అధ్యక్షుడు కె.ఎస్.వి.ప్రసాద్, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్‌మహబూబ్‌జాన్, ఆంధ్రసారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు మూడమంచు వెంకటేశ్వర్లు, అక్షరసాహితీ సమితి అధ్యక్షుడు ఎం.వి.ఎస్.శాస్త్రి, ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం సభ్యులు సయ్యద్‌ఇస్మాయిల్, గంగిశెట్టి నరసింహారావు, సాహితీవేత్త ఓరుగంటి ప్రసాద్, సినీ విశ్లేషకులు జానకీరామ్, అడ్వకేట్ నాగిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం..



కుల గణన సర్వేను పరిశీలిస్తున్న సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఉషారాణి

నవరత్నాలతో ఇప్పటికే అన్నీ వర్గాల ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మరింతగా అన్నీ సామాజిక వర్గాలకు మెరుగైన జీవనం ఉండాలని, అందుకు అందరికీ తగిన న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో కులగణన సర్వేకు శ్రీకారం చుట్టారు. సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. వంద సంవత్సరాల తర్వాత కులగణనకు శ్రీకారం చుట్టింది.

- జిల్లాలో కులగణన సర్వే ప్రారంభం
- అన్నీ సామాజిక వర్గాల మెరుగైన జీవనానికి కుల గణన చేపట్టిన ప్రభుత్వం
- ఈనెల 28వ తేదీ వరకు పది రోజుల పాటు సర్వే
- ఆ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ పూర్తి
- ప్రతి సచివాలయానికి మండల స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియామకం
- కుల, మత పెద్దలకు సర్వేపై అవగాహన
- వలస వెళ్లిన ప్రజలను గుర్తించేందుకు చర్యలు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే జిల్లాలో ప్రారంభమైంది. ఆ మేరకు శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేసి వివరాలు సేకరిస్తున్నారు. అందుబాటులో లేని ప్రజల వివరాలు నమోదు చేసేందుకు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవకాశం కల్పించింది. సర్వే పారదర్శకంగా చేసేందుకు వేలాది మంది ఉద్యోగులు, వలంటీర్లతో పాటు జిల్లా స్థాయి అధికారులకు కలెక్టర్ విధులు అప్పగించారు. జిల్లాలో 132 వార్డు సచివాలయాలు, 585 గ్రామ సచివాలయాలతో పాటు ఒక కార్పొరేషన్, 3 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు ఉన్నత చదువులు, ఉపాధి, ఉద్యోగ కల్పనకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ సర్వే ఉపకరించనుంది. ఆ మేరకు సర్వేలో పాల్గొనే సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు కుల, మత పెద్దలకు సైతం అవగాహన కల్పించారు.

వందేళ్ల తర్వాత కులగణన:

1881లో దేశంలో తొలిసారిగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేశారు. అనంతరం 1921 వరకు పదేళ్లకు ఒకసారి కులగణన చేస్తూ వచ్చారు. తర్వాత కుల గణన నిలిచిపోయి కేవలం జనగణన మాత్రమే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కుల గణన చేపట్టారు. సుదీర్ఘకాలంగా కుల సంఘాల నుంచి కుల గణన చేపట్టాలనే డిమాండ్లు వస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల అమల్లో ఎన్నో ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కులగణన సర్వే నిర్వహణ కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణతో పాటు తగిన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభమైంది. 726 కులాలు, ఉపకులాలకు సంబంధించి కుల గణన చేస్తున్న ఒకే ఒక రాష్ట్రంగా మన రాష్ట్రం గుర్తింపు పొందడం విశేషం.

12,442 మంది వలంటీర్లు, 5 వేల మంది సచివాలయ సిబ్బంది:

జిల్లాలో చేపట్టిన కులగణన సర్వేలో 12442 వలంటీర్లు, 5 వేల మంది సచివాలయాల సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి సచివాలయానికి ఒక మండల స్థాయి అధికారి, వారిపై జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ నోడల్ అధికారులుగా నియమించారు. మొత్తం సర్వేను సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఉషారాణి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 7,73,607 గృహాలకు సంబంధించి 22,50,177 మంది జనాభా ఉన్నారు. వారిలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలతో పాటు ఎంత మంది ఏ ఉపకులాల జనాభాలో ఉన్నారు. వారి స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వేలో వివరాలు సేకరిస్తారు. ఈ నెల 28వ తేదీ వరకు ఇంటింటి సర్వే పూర్తి చేసి ఆ తర్వాత 29 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు మిగిలిపోయిన వారి వివరాలు సేకరిస్తారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు సేకరించిన సమాచారాన్ని సచివాలయాల్లో క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

సర్వే ప్రక్రియ ఇలా...

కులగణన సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే సిబ్బంది నమోదు చేస్తారు. వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవీ అడగాల్సిన అవసరం లేదు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి వారి కులం వారికే నమోదు చేస్తారు. స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సర్వే ఎవరైనా కులం పేరు చెప్పేందుకు ఇష్టపడకుంటే బలవంతం చేయనవసరం లేదు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుంది. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు వెళ్లదు. వివరాలు నమోదు చేసినా ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలి. 8 ఏళ్ల లోపు వయసు ఉన్న వారికి ఈకేవైసీ తప్పనిసరి కాదు. సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను నివేదిస్తారు.



మార్కాపురం మండలం చింతకుంట్లలో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఓ చందన

సేకరించే వివరాలు ఇవీ...

- కుటుంబ సభ్యులు అందుబాటులో ఉన్నారా... మరణించారా... శాశ్వతంగా వలస వెళ్లారా
- జిల్లా, జిల్లా కోడ్, మండలం / మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్, వార్డు, ఇంటి నంబర్లు
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుని పేరు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, రేషన్ కార్డు నంబర్
- కుటుంబం నివాసం ఉంటున్న ఇంటి పరిస్థితి, ప్రస్తుత చిరునామా, మరుగుదొడ్డి ఉందా లేదా
- తాగునీటి సదుపాయం, పశు సంపద వివరాలు, వంట సాధనం వివరాలు
- కుటుంబ సభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయ భూమి వివరాలు, నివాస స్థలం వివరాలు

పారదర్శకంగా సర్వే



ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే జిల్లాలో పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. అందుకు పక్కాగా చర్యలు తీసుకున్నాం. సర్వేలో సేకరించిన వివరాలను గోప్యతతో పాటు భద్రంగా ఉంచుతాం. దాదాపు వందేళ్ల తర్వాత కులగణన జరుగుతోంది. ఈ సర్వేతో ప్రభుత్వ పథకాలు మరింతగా ప్రజలకు చేరువవుతాయి. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు మరింత మేలు కలిగేందుకు ఉపకరిస్తుంది.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

వచ్చే నెల నుంచి కందుల కొనుగోలు



జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్న జేసీ కె.శ్రీనివాసులు,చైర్మన్ రవీంద్రరెడ్డి



మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెక్కు అందజేస్తున్న జేసీ కె.శ్రీనివాసులు, చైర్మన్ రవీంద్రరెడ్డి, అధికారులు

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో పండుతున్న కందులను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆ మేరకు ఫిబ్రవరి రెండో వారం నుంచి సేకరణ ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో కందులు, ధాన్యం సేకరణ, గత నెలలో తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అంశాలపై చర్చించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకే రైతుల వద్ద నుంచే కందులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అదేవిధంగా ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు స్పందిస్తూ ఆ దిశగా బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కంపెనీల నుంచి తెప్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ నష్ట పరిహారాన్ని రైతులకు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని మండలి చైర్మన్ కోరగా నష్టపోయిన 8 రకాల పంటల వివరాలను సేకరించి రూ.2.82 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, ఎంపీఎంఐపీ పీడీ రమణ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ఆత్మ పీడీ అన్నపూర్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డు క్రెడిట్ లింకేజ్ ప్లాన్ పుస్తకాన్ని జాయింట్ కలక్టర్ ఆవిష్కరించారు. అనంతరం తాళ్లూరు మండలానికి సంబంధించిన మహిళా రైతులతో ఏర్పాటు చేసిన 70 రైతు ఉత్పత్తి సంఘాలకు రూ.3.5 కోట్ల రుణాల తాలూకు బ్యాంకు చెక్కును అందజేశారు.

రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందజేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఈ నెల 22వ తేదీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితా అందజేయాలని జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి ఓటర్ల జాబితా సవరణ, తుది జాబితా ప్రచురణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యమైన తప్పులు ఉండకూడదన్నారు. బీఎల్ఓ స్థాయిలో పక్కాగా మాన్యువల్ రికార్డును తయారు చేయించి భద్రపరుచుకోవాలని ఈఆర్ఓలకు సూచించారు. అదేవిధంగా లాగిన్ ఐడీలను కూడా భద్రంగా ఉంచుకోవాలన్నారు. అసాధారణ స్థాయిలో కొత్త ఓటర్లుగా నమోదుకు, తొలగింపునకు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వీటికి సంబంధించిన రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. అర్హులైన ఓటర్లందరికీ త్వరగా ఫొటో గుర్తింపు కార్డులు (ఎపిక్) అందజేయాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో ఓటర్లకు చేరేలా చూస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనిలో ఈఆర్ఓలు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు పాస్టర్ల మద్దతు



మంత్రి సురేష్‌కు సంఘీభావం తెలుపుతున్న పాస్టర్లు

సింగరాయకొండ: స్థానిక మండల కాంప్లెక్స్ సమీపంలోని కెవెనెంట్ చర్చిలో శుక్రవారం కొండపి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు అందరూ రాబోయే ఎన్నికల్లో తమ మద్దతును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ప్రకటించి తీర్మానం చేశారు. మంత్రి సురేష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించడమే తమ కర్తవ్యమన్నారు. సుమారు 200 మంది పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు ఇండ్ల కోటేశ్వరరావు, ఎం అశోక్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ అని నినదిస్తూ..

- అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణకు విజయవాడకు తరలిన జిల్లా ప్రజలు
- ప్రతి మండలం నుంచి స్వచ్ఛందంగా పయనమైన జనం



శంకరాపురం వద్ద బస్సులను పంపుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు/ఒంగోలు సెంట్రల్:
విజయవాడ నగరం నడిబొడ్డున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 206 అడుగులు ఎత్తున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణను ప్రత్యక్షంగా తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా ప్రజలు భారీగా తరలివెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులతో పాటు పెద్ద ఎత్తున ప్రైవేటు వాహనాల్లో అంబేడ్కర్ అభిమానులు జైభీమ్ నినాదాలతో హోరెత్తిస్తూ కార్యక్రమంలో పాల్గొనేందుకు పయనమయ్యారు.

దర్శి నియోజకవర్గంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి శంకరాపురం వద్ద జెండా ఊపి 2 వేల మందికిపైగా ప్రజలను వాహనాల్లో పంపారు. మార్కాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీ క్రిష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రయివేట్ వాహనాల్లో ప్రజలు తరలివెళ్లారు. కనిగిరిలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం బస్సులకు జెండా ఊపి యాత్రకు పంపారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇన్‌చార్జి, మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, ప్రయివేట్ బస్సులను అయా మండలాల పార్టీ అధ్యక్షులు జెండాలు ఊపి పంపారు. కొండపి నుంచి మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో, గిద్దలూరు నియోజకవర్గంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో, యర్రగొండపాలెంలో నియోజకవర్గ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలు తరలివెళ్లారు. త్రిపురాంతకంలో సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ జెండా ఊపి బస్సులను, వాహనాలను పంపారు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు ఏర్పాటు చేయించారు.

ఒంగోలు నియోజకవర్గం నుంచి విగ్రహావిష్కరణకు తరలివెళ్లేందుకు ఆసక్తి చూపిన ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందిరాకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో నగర మేయర్ గంగాడ సుజాత, నగరంలోని డివిజన్ కార్పొరేటర్లు, మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్తున్న వారికి ఇబ్బంది లేకుండా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అల్పాహారం ఏర్పాటు చేయడంతోపాటు స్నాక్స్, ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. మేయర్ గంగాడ సుజాత చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ అభిమానులు సగర్వంగా తలెత్తుకుని ఆత్మగౌరవ నినాదాన్ని ఎలుగెత్తి చాటే రోజు అన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఏమైతే ఆశించారో వాటిని బడుగు బలహీన వర్గాలకు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అద్భుతం అన్నారు. రాజ్యాధికారం దిశగా నామినేటెడ్ పదవులను సైతం కల్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాల్సిన తరుణం ఇదే అన్నారు. చంద్రబాబు గతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి అనంతరం నిర్లక్ష్యం చేసిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబుకు దళితులన్నా, బీసీలన్నా గిట్టదనేది గత ప్రభుత్వ హయాంలోనే స్పష్టమైందన్నారు. కానీ నేడు జగనన్న మాత్రం ప్రతి ఒక్కరూ తన వాళ్లు అంటూ ఆత్మీయంగా ఆప్యాయతను కనబరుస్తున్న విషయం మనకందరికీ తెలుసని, ఈ నేపథ్యంలో మన మంచి కోరుతున్న జగనన్నకు అండగా నిలుద్దాం అని పిలుపునిచ్చారు.



ఒంగోలు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బస్‌లలో తరలివెళ్తున్న మేయర్ గంగాడ సుజాత, నాయకులు, కార్యకర్తలు



కుటుంబ కథా 'చిత్రం'

అమ్మ ఒడిలో హాయిగా.. నాన్న భుజాలపై ధైర్యంగా
సొంత గూడులో ఆనందంగా.. బడిలో అ..ఆలు దిద్దుతూ
సాయంత్రం గెంతులు వేస్తూ.. రాత్రికి వేడి పప్పులో నెయ్యి
బొట్లు కలుపుతూ.. ఆరుబయట చుక్కలు లెక్కేయడం
ఈ చిన్నారులకు తెలీదు!
కాగితాలు సేకరించే రిక్షా.. రక్తాన్ని ప్రేమ ముద్దగా చేసే అమ్మా నాన్న,
తమలో భాగమైన చెత్తాచెదారం.. అవి అమ్మితే వచ్చే కాసుల మోత
చిరిగిన గుడ్డలు.. ఊరంతా మన ఇల్లే అనుకొనే పసితనమే
ఈ చిన్నారుల ఆస్తిపాస్తులు. ఒంగోలు నగరంలో రిక్షానే ఇంటిగా మార్చుకున్న
ఓ పేద కుటుంబ కథా చిత్రమిది!

– ఫొటో: ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కేంద్ర బృందం తనిఖీ


క్లినిక్ రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు శైలేష్‌పాటిల్

సింగరాయకొండ: మండల కేంద్రమైన సింగరాయకొండలో సచివాలయం–2 పరిధిలోని విలేజ్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఇద్దరు సభ్యులతో కూడిన జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ శైలేష్‌పాటిల్ క్లినిక్‌లో అందుతున్న సేవలను, వైద్య పరికరాలు, మందులు, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ వంశీధర్, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో పాకల విద్యార్థినులు


జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన పాకల విద్యార్థినులు

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు ఏడుగురు పాకల విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ పి.హజరత్తయ్య తెలిపారు. చిన గంజాంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో కె.నందిని, కె.భూమిక, వి.అర్చన, కె.విజయలక్ష్మి, వి.అపర్ణ, కె.త్రిగుణ, కె.సిపోరా సత్తా చాటి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో నిర్వహిస్తున్న 49వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్ తెలిపారు. అభ్యర్థులందరికీ హాల్‌టికెట్లు పంపామని, ఎవరికైనా అందకపోతే విద్యార్థి తాను చదువుతున్న పాఠశాల హెచ్ఎం ద్వారా ఎంఈఓను కలిసి పొందవచ్చన్నారు.


పుల్లలచెరువులో రైతు భరోసా కేంద్రం


బేస్తవారిపేట మండలం పెద్దఓబినేనిపల్లిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్

పశ్చిమం.. వృద్ధి పథం

"మా ఊరు మారింది.. మా పల్లెలో అన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గతంలో ఏదైనా పని కావాలంటే మండల కేంద్రానికి పోవాలి. ఇప్పుడు ఊర్లోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, నాడు నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇలా ఒకటేమిటి అన్ని విధాలుగా ఊరు మారింది. దళారీ వ్యవస్థ కనిపించడం లేదు. పిల్లల చదువులకు ఇబ్బంది లేదు. పెద్దల ఆరోగ్యానికి భయం లేదు".. ఇదీ పశ్చిమ ప్రకాశంలోని పల్లెల్లో ప్రజల మనోగతం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన దరిమిలా గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని, సకాలంలో సేవలు అందుతున్నాయని పశ్చిమ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- చింత లేకుండా చెంతనే సేవలందిస్తున్న సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు
- 171.46 కోట్లతో సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ భవనాలు
- మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల ప్రజల హర్షం

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవస్థలు గాడినపడ్డాయి. జన్మభూమి కమిటీలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ప్రశంసిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సులు లేకుండానే అందుతుండటం, పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతుండటమే అందుకు కారణం. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలు వృద్ధి పథంలో ముందంజలో ఉన్నాయి.

టీడీపీ జమానాలో వ్యవస్థల విధ్వంసం

టీడీపీ హయాంలో గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేశారు. విద్య, వైద్య రంగాలపై అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శించారు. రైతులు, డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో నిలువునా మోసం చేశారు. ఫలితంగా సంక్షేమం కుంటుపడింది. ఈ తరుణంలో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో దండగలా మారిన వ్యవసాయం.. నేడు రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పండగలా మారింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతులు తమ స్వగ్రామాల్లోనే కొనుగోలు చేసుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, గిట్టుబాటు ధరలను ఎప్పటికప్పుడు ఆర్బీకేకు వెళ్లి ఆన్‌లైన్‌లో చూసుకుంటున్నారు. నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగం కూడా గాడిన పడింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి ముంగిటకే డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు.

కొండేపల్లిలో అభివృద్ధి ఇలా..

మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటే గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి వైపు పయనిస్తోంది. మూడున్నర లక్షల రూపాయలతో గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మించారు. రూ.12 లక్షలతో ప్రజలకు నీటి సరఫరా అందించేందుకు పైపులైన్లు వేశారు. రూ.2 కోట్లతో మిట్టమీదిపల్లి వరకు రోడ్డు వేశారు. జల్‌జీవన్ మిషన్ కింద మొదటి ఫేజ్‌లో 8 లక్షల రూపాయలతో పైపులైన్లు వేస్తున్నారు. సెకండ్ ఫేజ్‌కు కూడా రూ.16.90 లక్షలు మంజూరయ్యాయి. ఇలా ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపట్టారు.

సచివాలయాల రాకతో సమూల మార్పులు

టీడీపీ ప్రభుత్వంలో ఏదైనా ప్రభుత్వ పథకం దక్కాలంటే జన్మభూమి కమిటీలు సిఫార్సు చేయాల్సి వచ్చేంది. పింఛను కావాలంటే ఆ గ్రామంలో ఎవరో ఒకరు చనిపోతేనే కొత్త పింఛను వచ్చేది. రేషన్ కార్డు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సు కావాలి. దీంతో ఐదేళ్లపాటు అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం అగచాట్లు పడ్డారు. ఈ దుస్థితిని మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వెటర్నరీ, హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లను నియమించారు. ప్రజలకు కావాల్సిన జనన, మరణ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, మ్యుటేషన్లు, రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, చేదోడు లాంటి పథకాల అమలుకు కూడా అర్హత ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.



కొండేపల్లిలో పూర్తయిన విద్యుత్ సబ్‌స్టేషన్


కొండేపల్లిలో నూతనంగా నిర్మించిన రోడ్డు



మార్కాపురం మండలం వేములకోటలో సచివాలయం



సేవలకు చిరునామాలు.. ప్రభుత్వ భవనాలు

ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లేందుకు సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు సేవలకు చిరునామాగా మారాయి. గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.21.08 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ.20.08 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మొత్తం మీద పశ్చిమ ప్రకాశంలో వివిధ ప్రభుత్వ భవనాలను రూ.171.46 కోట్లతో నిర్మిస్తున్నారు.

సచివాలయాలు

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో..
మార్కాపురం	59	48	11
గిద్దలూరు	78	61	17
యర్రగొండపాలెం	80	62	18

రైతు భరోసా కేంద్రాలు

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో
మార్కాపురం	57	49	08
గిద్దలూరు	65	57	08
యర్రగొండపాలెం	62	49	13

హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో
మార్కాపురం	46	21	25
గిద్దలూరు	40	24	16
యర్రగొండపాలెం	36	22	13

మా ఊరు మారింది


కొండేపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వాటర్ ట్యాంకు, పైపులైన్లు, మార్కాపురం నుంచి మిట్టమీదిపల్లి వరకు రోడ్డు నిర్మాణం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఇవేకాక ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాం. ఇలా మా గ్రామం పూర్తిగా అభివృద్ధి పథంలో ఉంది.
– కె. మల్లారెడ్డి, ఎంపిటిసి, కొండేపల్లి

గ్రామం రూపురేఖలు మారాయి


గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో రూపురేఖలు మారాయి. గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకేల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచి నీరు, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. మొత్తానికి మా ఊరి రూపురేఖలు మారిపోయాయి.
– శ్రీకాంత్‌రెడ్డి, చెన్నారెడ్డిపల్లి, మార్కాపురం

ఊర్లోనే అన్ని రకాల సేవలు


ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత మా ఊర్లోనే సచివాలయం కట్టారు. రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. మాకు కావాల్సిన సర్టిఫికెట్లన్నీ సచివాలయంలోనే వస్తున్నాయి. ఊర్లో వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన ఇంటింటికీ వచ్చి పింఛను ఇస్తున్నారు.
–టి.రామిరెడ్డి,వేములకోట, మార్కాపురం

సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి విప్లవం


గ్రామ సచివాలయాల ద్వారా పల్లెల్లో అభివృద్ధి విప్లవం ప్రారంభమైంది. 530కి పైగా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోనికి వచ్చాయి. గతంలో వివిధ రకాల సర్టిఫికెట్ల నిమిత్తం పనులు మానుకుని రోజుల తరబడి మండల కేంద్రాలకు వచ్చి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి గ్రామాల్లో లేదు. నేరుగా సచివాలయానికి వెళ్లి అన్ని రకాల సేవలు, పథకాలు పొందవచ్చు. మన సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి.
– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

రూ.171.46 కోట్లతో అభివృద్ధి పనులు


పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజక వర్గాల్లో 171.46 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయి. మార్కాపురం డివిజన్‌లో 217 సచివాలయాలు, 184 రైతు భరోసా కేంద్రాలు, 122 వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. చాలా వరకు నిర్మాణాలు పూర్తికాగా కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.
– వై. రమేష్‌బాబు, పంచాయితీరాజ్ ఈఈ, మార్కాపురం

సత్తా చూపిన సిక్కోలు చీతాస్

- హోరాహోరీగా సౌత్ ఇండియా క్రికెట్ పోటీలు
- 57 బంతుల్లో 147 పరుగులు, 8 బౌండరీలు, 14 సిక్సర్లతో ప్రసాద్


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న ప్రసాద్

పర్చూరు (చినగంజాం): సౌత్ ఇండియా క్రికెట్ పోటీల్లో సిక్సర్ల వర్షం కురిసింది. అలా బౌలర్ బాల్ వేయగానే ఇలా సిక్స్ అంతే.. ఒకటి కాదు రెండు ఏకంగా 14 సిక్సర్లు మ్యాచ్‌లో నమోదయ్యాయి. చూడటానికి వచ్చిన ప్రేక్షకుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పర్చూరులో నిర్వహిస్తున్న సౌత్ ఇండియా లెవెల్ క్రికెట్ పోటీలో శుక్రవారం కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే నిర్వహించారు. ఉదయం సిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం), సౌత్‌జోన్ సీసీ (చెన్నై) జట్ల మధ్య జరిగింది. ఈమ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 235 పరుగులు సాధించింది. జట్టులో ఎస్‌బీవీఎస్ ప్రసాద్ 57 బంతుల్లో 147 పరుగులు సాధించి నాటౌట్‌గా మిగిలాడు. 8 బౌండరీలు 14 సిక్సర్‌లతో తుఫాన్ ఇన్నింగ్స్ ఆడి చెన్నై బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపించాడు. తరువాత లక్ష్య ఛేదనకు దిగిన చెన్నై ఎక్కడా కూడా ఆ దిశగా సాగలేదు. జట్టులోని బ్యాటర్లు వెంటవెంటనే పెవిలియన్‌కు క్యూ కట్టారు. 9 వికెట్‌లు కోల్పోయి 111 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో శ్రీకాకుళం 125 పరుగుల భారీ తేడాతో చెన్నైపై విజయం సాధించింది. సిక్సర్లతో విరుచుకుపడి సెంచరీ సాధించిన శ్రీకాకుళం బ్యాటర్ ప్రసాద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

నేడు జరిగే సెమీ ఫైనల్ మ్యాచ్‌లు..

శనివారం ఉదయం ఎంఏకే (కర్ణాటక), మస్తాన్ లెవెన్ (జార్ఖండ్)ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. మధ్యాహ్నం సిక్కోలు చితాస్ (శ్రీకాకుళం), ఒంగోలు బుల్స్ లెవెన్‌ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


హోరాహోరీగా తలపడుతున్న చెన్నై, శ్రీకాకుళం జట్లు

ఆస్పత్రిలో ఉన్న తల్లిని చూసేందుకు వెళ్తుండగా..

- ప్రైవేట్ బస్సు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

పర్చూరు(చినగంజాం): ఆస్పత్రిలో ఉన్న తల్లిని చూసేందుకు వెళ్తుండగా ప్రైవేటు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓవ్యక్తి మృతి చెందాడు. ఈఘటన శుక్రవారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామానికి చెందిన వెల్లటూరి వేణుబాబు (36) తన ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు ఎర్రం గణేష్‌రెడ్డితో కలిసి గుంటూరులోని రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ప్రత్తిపాడు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొనడంతో వేణుబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు గణేషరెడ్డి తీవ్రంగా గాయపడటంతో అతనిని 108 వాహనంలో గుంటూరుకు తరలించారు. మృతుడు వేణుబాబు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా వర్క్ ఫ్రం హోం చేసుకుంటూ స్థానికంగా దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. మృతుడు వేణుబాబుకు భార్య, ఏడు నెలల చిన్నారి ఉన్నారు. సమాచారం తెలుసుకున్న బంధువులు అక్కడకు చేరి భోరున విలపించారు.


మృతి చెందిన వేణుబాబు

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన


పోటీలో బండ లాగుతున్న ఎద్దులు

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పర్చూరు మండలం అన్నంబొట్లవారి పాలెం గ్రామంలోని గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన 36వ జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం ముగిశాయి. గత వారం రోజుల నుంచి జరుగుతున్న ఎడ్ల పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది రైతులు, పశుపోషకులు తరలి వచ్చారు. ఎద్దులు బండ లాగుతున్న సమయంలో ప్రజలంతా ఈలలు వేస్తూ కేరింతలు కొడుతున్న తీరు పెద్ద ఉత్సవంలా కొనసాగింది. పెద్ద సైజు విభాగంలో జరిగిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు తెలంగాణా, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాల నుంచి ఆరు జతలు ఎడ్లు పోటీలలో తలపడినట్లు నిర్వాహకుడు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. కడపటి సమాచారం అందే సమయానికి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన త్రిసజ్జారెడ్డి ఎడ్ల జత 22 క్వింటాళ్ల బరువు ఉన్న బండను 25 నిమిషాల్లో 3901.7 అడుగులు దూరం లాగి ముందంజలో ఉన్నాయి. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఎస్ఎస్ బుల్స్ ఎడ్ల జత 3900 అడుగులు దూరంగా లాగి రెండో స్థానంలోను, గుంటూరు జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్‌కే బుల్స్ ఎడ్ల జత 3405 అడుగులు దూరం లాగి మూడో స్థానంలోను, గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన దాసరి నారాయణ ఎడ్ల జత 2486 అడుగులు దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. పెద్ద సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్ల జతకు మొదటి బహుమతి రూ. 1,30,116, రెండో బహుమతి రూ.90,116, మూడో బహుమతి రూ.50,116, నాలుగో బహుమతి రూ.30,116, ఐదో బహుమతి రూ.21,116, ఆరో బహుమతి రూ.20,116, ఏడో బహుమతి రూ.12,116, చివరి బహుమతి రూ.10,116 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ 1,30,116లను గొట్టిపాటి హనుమంతరావు, గొట్టిపాటి కిషోర్, గొట్టిపాటి నరసయ్యల జ్ఞాపకార్థం గొట్టిపాటి భరత్ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.


ఎడ్ల పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు